జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
మంగళవారం, 18, జూన్ 2024 | 5 పేజీలు

## బిజిగీర్ షరీఫ్‌లో ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



**జమ్మికుంట,జూన్17 ( ప్రజా జ్యోతి):** జమ్మికుంట మండలంలోని బిజిగిర్ షరీఫ్ గ్రామంలో ముస్లిం సోదరులు సోమవారం రోజున భక్తిశ్రద్ధలతో ఈదుల్ జుహా బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

2లో..

# బెల్టు షాపుల జోరు





**రామగిరి, జూన్ 17 (ప్రజాజ్యోతి) :** బెల్టు షాపుల ద్వారా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరుతోంది. మరింత ఆదాయాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బెల్టుషాపులను అంతర్గతంగా ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో మహిళల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అటు ఎక్సైజ్ శాఖ అధికారులు కానీ.. ఇటు పోలీసులు కానీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మత్తులో జోగుతున్న పల్లెలు
- కిరాణా షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- పెడదారి పడుతున్న యువత
- పచ్చని సంసారాలను పాడు చేస్తున్న మద్యం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్ అధికారులు

2లో...

## ఎల్ఎండీలో జారిపడి వ్యక్తి మృతి

2లో...



**ప్రజాజ్యోతి కరీంనగర్ క్రైమ్:** ప్రమాదవశాత్తూ ఎల్ఎండీలో జారిపడి సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన విజయ్ అనే వ్యక్తి ఆసిఫాబాద్ జిల్లాలో పే అండ్ అకౌంట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సెలవు దినం కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి అలుగునూర్ లోని ఎల్ఎండీ దగ్గరకు వచ్చాడు.

## నేడు పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున సాయం

రైతుల ఖాతాల్లో జమ చేయనున్న ప్రధాని మోదీ

**జమ్మికుంట, జూన్17( ప్రజా జ్యోతి):** రైతన్నలకు ప్రధానమంత్రి కిసాన్ 17వ విడత సాయం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పథకం కింద ఏటా మూడు విడతల్లో మొత్తం రూ.6 వేలు జమ చేస్తోంది. 2024-25 వ్యవసాయ సీజన్లో తొలి విడత పీఎం కిసాన్ సాయం కింద నేడు రైతుల ఖాతాల్లోకి జమ చేయనుంది.



5లో...

# బిజిగీర్ షరీఫ్‌లో ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

మొదటి పేజీ తరువాయి





ఈద్గాలో సామూహిక నమాజు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. మత గురువు మౌలానా నౌమన్ హష్మీ గారు ఖురాన్ లోని సూక్తులను ప్రజలకు చదివి వినిపించారు. హజ్రత్ ఇబ్రహీం అలైహి సలాం, హజ్రత్ ఇస్మాయిల్ అలైహి సలాం లా త్యాగనిరతిని స్మరించుకుంటూ జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేసి కాబా గృహాన్ని దర్శించాలని? కుర్బానీ చేయాలని మౌలానా నౌమాన్ హష్మీ తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెల్పుకున్నారు.. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌపిక్ హుస్సేన్, కార్యదర్శి మొహమ్మద్ జమాల్ అష్రఫ్,సంయుక్త కార్యదర్శి నైముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# 'బెల్టు' షాపుల జోరు

మొదటి పేజీ తరువాయి

**అధికారులు కనుసన్నల్లోనే..** మండలంలో మద్యం అమ్మకాలు లక్షల్లో రూపాయల్లో వైన్స్ షాపులు, బార్‌లు నడుస్తున్నాయి. ఈ మద్యం దుకాణాలు, బార్‌లలో ప్రతీనెల లక్షల రూపాయల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్స్ యజమానులు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో మండల వ్యాప్తంగా ఊరూరా బెల్టుషాపులు నడుస్తున్నాయి. మద్యం అమ్మకాలు పెంచాలని ప్రభుత్వం ఎక్సైజ్ అధికారుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలకు ఊరూరా బెల్ట్‌షాపులు పెట్టి అనధికారికంగా మద్యం అమ్ముతున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ప్రతీ కిరాణా కొట్టులో...** గ్రామాల్లో పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్జులు ఏర్పాటు చేసుకుని బీర్లు విక్రయిస్తున్నారు. వైన్‌షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోల ద్వారా పంపించి అమ్ముతున్నారు. మద్యం తాగి చాలామంది ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతోంది.

**గ్రామాల్లోనూ వేలం :** గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేసేందుకు వేలం వేస్తున్నారు. గ్రామ పెద్దలంతా కలిసి గ్రామాభివృద్ధికి కొంత సొమ్ము ఇవ్వాలని తీర్మానాలు చేస్తున్నారు. ఈ సొమ్మును గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు వాడుతున్నారు. కొన్నిచోట్ల బెల్ట్ షాపు వలం రూ.6 నుంచి రూ.10 లక్షల వరకు పలుకుతుంది. రెండేళ్ల పాటు మద్యం విక్రయించుకునేందుకు గ్రామ పెద్దలు అనధికారికంగా తీర్మానం చేసిన ధాఖలలు మండలంలో నిర్ణయించినట్లు పలు ఆరోపణలు వెల్లువేతున్నాయి .



**మా ఊళ్లో బెల్టుషాపులు తీసేయాలి:** మండలంలోని పరిధిలోని గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టుషాపులు వెలిశాయి. ఇటు అధికారులు కానీ.. అటు ప్రజాప్రతినిధులు కానీ.. పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పచ్చని సంసారాలు పాడవుతున్నాయి. వేకువ జామునే బెల్టుషాపులు తెరిచి ఉంటున్నాయి. ఈ గ్రామంలో ప్రతి కిరాణా షాపు బెల్టుషాపుగా మారీ, యువకులు తాడుగుకు బానిస అవుతున్నారు. ఉదయం లేవగానే చాయ్ తాగుతారో లేదో తెలియదు కానీ.. మద్యం మాత్రం తాగకుండా ఉండలేక పోతున్నారని, పనిచేసిన డబ్బులు మొత్తం తాగుడుకు ఖర్చు పెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లుషాపులు తొలగించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

**ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు జరగాలి**
**– శ్రీనివాస్, మంథని ఎక్సైజ్ సిఐ.**

ప్రభుత్వం నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు జరపాలి. నిబంధనలకు అతిక్రమిస్తే.. చర్యలు తప్పవు. గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే సంబంధిత అధికారికి సమచారం ఇవ్వండి. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాము. బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాము.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**– జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినం**

**– మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్**

జమ్మికుంట, జూన్17( ప్రజా జ్యోతి): మాదిగల చైతన్యం కోసం, ఏబిసిడి వర్గీకరణ కోసం 1994 లో ఆవిర్భవించిన దండోరా (ఎమ్మార్పీఎస్) ఆవిర్భవించి, 30 ఏళ్లు గడుస్తున్నా సందర్భంగా జూలై 7న వరంగల్ నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు... సీనియర్ కళాకారుడు రామంచ భరత అధ్యక్షతన జమ్మికుంట లోని ఒక ప్రైవేట్ గెస్ట్ హౌస్ లో సమావేశం ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పార్టీలకు అతీతంగా, మాదిగల ఆత్మగౌరవం కోసం మాదిగలు, మాదిగ ఉపకులాలు ఆవిర్భావ వేడుకలకు సమాయత్తం కావాలని అన్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా విడుదల చేసే పాటలకు, పుస్తకాల ముద్రణకు తనవంతుగా సహకారం అందిస్తానని అన్నారు. ఏబిసిడి వర్గీకరణ అంశంలో మందకృష్ణన్న చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం సీనియర్ నాయకుడు నలిగంటి శరత్ మాట్లాడుతూ మాదిగ జాతికి వారసులం కనుక ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆహ్వానం పలికారు. కవిత్వం, పాటలు, వ్యాసాలు సమీకరించి పుస్తక రూపంలో అందించబోతున్నామని అన్నారు. రచయితలు తమ రచనలు ఈనెల 25 లోగా పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కవులు, కళాకారులు ముక్కెర సంపత్ కుమార్, డా. కట్కూరి మహేందర్, అశోక్ మోరే, గిద్దె రాంనర్సయ్య, అంబాల మధునయ్య, గోల్కొండ బుచ్చన్న, పుల్లూరు సమ్మయ్య, జూపాక శివ, కన్నూరి ఆనంద్, కేతపాక ప్రసాద్,ఇమ్మడి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వలస కార్మికుల భద్రత యజమానులదే

**ప్రతి రైస్ మిల్ ఇటుక బట్టిలలో సీసీ కెమెరా తప్పనిసరి**

**పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ**





**సుల్తానాబాద్ జూన్ 17 (ప్రజా జ్యోతి)**

రామగుండం పోలీస్ కమిషనర్ సీఎం శ్రీనివాస్ ఐపీఎస్., (ఐజీ) ఆదేశాల మేరకు పెద్దపల్లి డిసిపి చేతన ఐపిఎస్., గారి ఉత్తర్వుల ప్రకారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని 110 రైస్ మిల్స్, 23 ఇటుక బట్టీల అసోసియేషన్ సభ్యులతో సుల్తానాబాద్ పట్టణం లోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ .. పొట్టకూటి కోసం వలస కూలీలు ఇతర రాష్ట్రాల నుండి వచ్చే, ఇతర కూలీల భద్రత రైస్ మిల్స్, ఇటుక బట్టి యజమానులదే అన్నారు. ప్రతి రైస్ మిల్లు ఇటుక బట్టీల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి వాటిని నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఇతర రాష్ట్రాల నుండి, ఇతర ప్రాంతాల నుండి కూలీలను తీసుకువచ్చిన్నపుడు వారి వివరాలు నమోదు చేసి రిజిస్టార్ మైంటైన్ చేయాలి సంబంధిత శాఖ తెలపాలి. మగ కూలీలు, ఆడ కూలీలకు వేరువేరుగా నివాస ప్రాంతాలను ఏర్పాటు చేయాలి. కుటుంబ సభ్యులతో ఉండేటువంటి కూలీల కి వేరుగా నివాస ప్రాంతాలు ఏర్పాటు చేయాలి. రైస్ మిల్ ఇటుక బట్టీల యజమానులు తమ వద్ద పనిచేసేటువంటి కూలీల యొక్క గత చరిత్రను తెలుసుకోవాలి చెడు అలవాట్లు ( మద్యం గంజాయి డ్రగ్స్ )కలిగిన వారి వివరాలు సేకరించి వారిని పనిలో ఉంచుకోకుండా చూడాలి. రైస్ మిల్ ఇటుక బట్టి ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డ్స్ ఏర్పాటు చేసుకొని రిజిస్టర్లు ఏర్పాటు చేసి ఇన్-అవుట్ అయ్యో వారి వివరాలు పూర్తిగా నమోదు చేయాలి. మిల్స్, బట్టీల లో కూలీల చేత వెట్టిచాకిరి చేయించ వద్దని, కార్మిక చట్టాలు కచ్చితంగా పాటించాలన్నారు. వారికీ కనీస అవసరాలు అనగా త్రాగునీరు, సరైన వసతి, ఆసుపత్రిలను ఏర్పాటు చేయక పోవడం, చిన్న చిన్న గదులలో వారి నివాసలల్తో ఇబ్బందులు పడకుండా కనీస ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రవణ్ కుమార్, మినపల ప్రకాష్ రావు నగునూరి అశోక్ జైపాల్ రెడ్డి తిరుపతి రెడ్డి పురుషోత్తరావు కేశవరావు పన్నాల రాములు తో పాటు రైస్ మిల్ ఇటుక బట్టీల యజమానులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎల్ఎండీలో జారిపడి వ్యక్తి మృతి

మొదటి పేజీ తరువాయి

డ్యాం లోపల కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగుతుండగా, అతడి కొడుకు, కూతురు ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయారు. వారిని కాపాడేందుకు దిగిన విజయ్ నీటిలోకి దిగి మునిగిపోగా, అక్కడే ఉన్న జాలరి శంకర్ విజయ్ కొడుకు, కూతురిని కాపాడాడు. సమాచారం అందుకున్న పోలీసులు డ్యాం దగ్గరికి చేరుకొని నీటిలో మునిగిన విజయ్ మృతదేహాన్ని బయటకి తీశారు.


**డ్యాం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే..** డ్యాంలో వ్యక్తి మునిగిపోయి చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. విజయ్ కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి భరోసా కల్పించారు.



# పాస్ బుక్కులు, రేషన్ కార్డులు ఉన్న వారికే రుణమాఫీ

శంకరపట్నం, జూన్ 18 (ప్రజా జ్యోతి)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల పంట రుణాల మాఫీపై కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు రుణమాఫీ అమలుకు విధివిధానాలు ఖరారు చేయడంలో నిమగ్నమైంది. అయితే పాస్‌బుక్‌లు, రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుని అవి ఉన్న వారికే రుణమాఫీ అమలు చేసేలా తాజాగా ఓ ప్రతిపాదనను అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు సమాచారం. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆదాయపన్ను చెల్లించే వారు, ఉద్యోగులను దీని నుంచి మినహాయించాలని మంత్రిమండలి సమావేశ ఎజెండాలో ప్రతిపాదించినట్లు తెలిసింది. పంట రుణాల మాఫీపై ఈ వారంలో క్యాబినెట్,సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశించడంతో వ్యవసాయాధికారులు రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్న వారి జాబితాను బ్యాంకుల నుంచి తెప్పిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో ఈ జాబితా అధికారులకు చేరనుంది. ఈలోపు పంట రుణమాఫీ రెండు లక్షలు ఎవరెవరికి అమలు



చేయాలనే దానిపై వ్యవసాయశాఖ వివిధ ప్రామాణికాల ప్రాతిపదికన విస్తృతస్థాయిలో అధ్యయనం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# నీట్ యూజీ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్రం తీరుపై మండిపడ్డ కేటీఆర్

### లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా పట్టించుకోని కేంద్రం

### ఓవైపు గ్రేస్ మార్కుల గందరగోళం.. మరోవైపు పేపర్ లీకేజీల వ్యవహారంతో తల్లిదండ్రుల్లో ఆందోళన

### పరీక్షా పే చర్చ నిర్వహించే ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు.. నీట్ వ్యవహారంపై స్పందించాలి

### మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టాలి..వెంటనే బాధ్యులను శిక్షించాలి

### కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలి

### కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

శంకరపట్నం, జూన్ 17(ప్రజా జ్యోతి)

కష్టపడి చదివే విద్యార్థులు డాక్టర్ కావాలని కలలు కన్న తల్లిదండ్రుల ఆశలపై గందరగోళంగా మారిన నీట్ పరీక్షా వ్యవహారం నీళ్లు చల్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ మండిపడ్డారు. ఓవైపు బీహార్ లో 30 లక్షల చొప్పున నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, ఇప్పటికే పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలొస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఆది నుంచి నీట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోందని విమర్శించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్ పై ఇన్ని ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ మోడీ సర్కార్ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు... ప్రతీసారి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని.. కీలకమైన నీట్ పరీక్షపై మాత్రం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు, లక్షలాదిమంది తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్ లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావటం ఎన్నోరకాల అనుమానాలకు తావిస్తోందని ధ్వజమెత్తారు. అందులో కూడా ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. అలాంటిది.. ఇంత ఒకే సెంటర్ లో ఇంతమంది విద్యార్థులకు పెద్దమొత్తంలో మార్కులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అలాగే ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు.. అసలు ఈ వ్యవహారం బయటకు రాగానే పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాల్సిన కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని ఇప్పటిదాకా పట్టించుకోలేదని నిలదీశారు. పైగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అంతా సవ్యంగానే జరిగిందంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. లక్షల మంది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసిన కేంద్రం స్పందించలేదని, పలువురు ప్రముఖులు సుప్రీంకోర్టులో కేసు వేసినా ఒక్క వివరణ కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కూడా కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చాలా చిత్రమైన సమాధానాలు చెప్పిందన్నారు. ఈ ఏడాది 1563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతోందని, అసలు నీట్ లాంటి ఎగ్జామ్ లకు గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేదని, అయినప్పటికీ ఎందుకిలా చేశారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 1563 మంది విద్యార్థులకే ఎందుకు గ్రేస్ మార్కులు ఇచ్చారో.... దానికి ఏ ప్రాతిపదికను తీసుకున్నారో స్పష్టం చేయటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ౦4, -1 విధానం ఉండే ఈ ఎగ్జామ్ లో సాధ్యం కాని విధంగా కొంతమంది విద్యార్థులకు 718, 719 మార్కులు రావటం కూడా మొత్తం గ్రేస్ మార్కుల విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ మొత్తం అంశం వివాదం కావటంతో ఇప్పుడు ఎన్టీఏ 1563 మందికి విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చామని వాటిని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిందన్నారు. గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులకు వాటిని తొలగించి మళ్లీ ఎగ్జామ్ రాయిస్తామని లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఉన్న ర్యాకింగ్ నే జత చేస్తామని పూటకో మాట మాట్లాడుతోందని మండిపడ్డారు.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ను ప్రమాదంలోకి నెట్టి ఇప్పుడు వాస్తవాలు బయటకు రాకుండా నానాతంటాలు పడుతున్నారని మండిపడ్డారు. ఒక్క గ్రేస్ మార్కుల అంశమే కాకుండా నీట్ పేపరే లీకైందంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. దీనికి బలం చేకూరే విధంగా గుజరాత్, బీహార్ లో పోలీసులు నీట్ లో అవకతవకలు పాల్పడిన కొంతమందిని అరెస్ట్ చేశారని, వరుసగా బయటపడుతున్న వివాదస్పద వ్యవహారాల కారణంగా నీట్ ఎగ్జామ్ తీరుపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా అనుమానాలు బలపడుతున్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా నీట్ ఎగ్జామ్ ను పెద్దసంఖ్యలో విద్యార్థులు రాశారని, నీట్ లో జరిగిన గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ ఆరోపణల కారణంగా తెలంగాణ విద్యార్థులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు మన రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించే విధంగా రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు ఎన్డీఏ సర్కారుపై ఒత్తిడి తేవాలని కోరారు. ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాల్సిన అవసరముంది. లక్షలాది విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించిన ఈ అంశంలో వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, వెంటనే ప్రధాని దీనిపై స్పందించి మొత్తం అవకతవకలకు బాధ్యులెవరన్నది దేశ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.. నీట్ లో జరిగిన అవకతవకల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా, వారికి న్యాయం చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇందులో ఎన్టీఏ పాత్ర పై అత్యున్నత దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారితోపాటు.. అక్రమంగా లబ్దిపొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.. అత్యంత ప్రతిష్టాత్మక నీట్ ఎగ్జామ్ మాత్రమే కాదు... దేశంలోని ఎన్నో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఎన్టీఏ ఆధ్వర్యంలోనే జరుగుతున్నందున తాజాగా బయటపడ్డ వివాదస్పద అంశాల కారణంగా ఎన్టీఏ పై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరముందన్నారు.. నీట్ లో అక్రమాల కారణంగా కష్టపడి చదివిన మన విద్యార్థులకు ఎలాంటి నష్టం జరిగినా అసలు ఊరుకునే ప్రసక్తే లేదని, వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టంచేశారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు



శంకరపట్నం, జూన్ 17 (ప్రజా జ్యోతి)

మండలంలోని కేశపట్నం ఈద్గా వద్ద బక్రీద్ పండుగ ముస్లిం సోదరులు ఘనంగా సోమవారం జరుపుకున్నారు ఈద్గా వద్ద ముస్లింలందరూ నమాజ్ చదివి దువా పాటించారు ఈ కార్యక్రమంలో జామా మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండ్ .ఖాజా మొయినద్దీన్ బక్రీద్ పండుక గూర్చి మాట్లాడుతూ. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం, అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఆయన మక్కా పట్టణాన్ని నిర్మించి, అక్కడే నివాసం ఉంటారు. అల్లాహ్‌ను ఆరాధించడానికి ప్రార్థనా మందిరి కాబా నిర్మించి దైవ ప్రవక్తగా పేరు ప్రఖ్యాతలు గడిస్తారు. అయితే ఇబ్రహీం దంపతులు ఎంతో కాలం తర్వాత ఓ బిడ్డకు జన్మనిస్తారు. తనకు ఇస్మాయిల్ అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకుంటారు. అయితే ఓ రోజు ఇబ్రహీంకు కలలో తన కుమారుడిని చంపుతున్నట్లు కనిపిస్తుంది. దీంతో అల్లాహ్ ఖుర్బానీ కోరుతున్నాడేమో అని భావించి ఒంటెను బలి ఇస్తారు. అయినా మళ్లీ అదే కల రావడంతో తన బిడ్డను బలిదానం కోరుకుంటున్నాడని, ఈ విషయాన్ని తన పుత్రుడికి చెబుతాడు. తను కూడా అల్లాహ్ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధమని చెబుతాడు. దీంతో తన బిడ్డను బలి ఇచ్చేందుకు సిద్ధమవ్వగా, అప్పుడు అల్లాహ్ ప్రాణ త్యాగానికి బదులుగా ఓ జీవాన్ని బలి ఇవ్వాలని జిబ్రాయిల్ అనే దూత ద్వారా సందేశం పంపుతాడు. అప్పటి నుంచి ప్రతి ఏటా బక్రీద్ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అని మీడియా వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మజీద్ కమిటీ సభ్యులు ప్రజలు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కి శుభాకాంక్షలు

# తెలిపిన బిజెపి రాష్ట్ర, జిల్లా నేతలు



**ప్రజాజ్యోతి కరీంనగర్ బ్యూరో:** బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులైన సందర్భంగా కరీంనగర్ బిజెపి ,రాష్ట్ర జిల్లా నేతలు ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ని కలిసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు , ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి ,జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట రెడ్డి , రంగు భాస్కరాచారి ,కాసింపేట ఎంపీటీసీ ఏలేటి స్వప్న చంద్ర రెడ్డి , జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి ,జిల్లా నాయకులు ముదిగంటి విద్యాసాగర్ రెడ్డి , కొత్తకొండ వెంకట సాయి, పారిపెల్లి రాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ ఎన్నిక కావడం తెలంగాణకు, ముఖ్యంగా కరీంనగర్ జిల్లాకు గర్వకారణమన్నారు. సామాన్య కార్యకర్త నుండి కేంద్ర మంత్రి స్థాయి వరకు బండి సంజయ్ కుమార్ రాణించారని, నిస్వార్థంగా పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన దూబాల శ్రీనివాస్

## గృహ జ్యోతి పథకంలో అనేక లోటుపాట్లు ఉన్నాయి

### 200 యూనిట్లు వరకు ఉచితమని, ఆ లోపు వచ్చిన వారికి కూడా విద్యుత్ చెల్లింపు బిల్లులు జారీ చేయడం దారుణం

**ప్రజాజ్యోతి కరీంనగర్ టౌన్:** బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రిగా నియమితులైన సందర్భంగా కరీంనగర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆయనను ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపిలో సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన బండి సంజయ్ కుమార్ కు దక్కిన అరుదైన గౌరవం కేంద్ర మంత్రి పదవి అన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుంది అనడానికి బండి సంజయ్ కుమార్ నిదర్శనంగా నిలుస్తారన్నారు. అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకంలో అనేక లోటుపాట్లు ఉన్నాయని ఆయన ఆరోపించారు. గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్ నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. 200 యూనిట్ల లోపు వారికి జీరో బిల్లులు ఇవ్వాల్సింది పోయి, చెల్లింపు విద్యుత్ బిల్లులు జారీ చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ గృహ జ్యోతి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



# కోలాట బృంద నృత్యం తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్





**- హుజురాబాద్‌కి వన్నెతెచ్చిన తపస్వి డాన్స్ అకాడమీ**
**- ఆడపడుచులకు ఏ ఆపద వచ్చిన అండగుంట**
**- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**జమ్మికుంట, జూన్17( ప్రజా జ్యోతి):** హుజురాబాద్ లోని తపస్వి డాన్స్ అకాడమీ 1008 మంది మహిళలచే గోవింద నామాలతో కోలాట మహా బృంద నృత్యం ద్వారా సహస్ర మహెూత్సవ సామ్రాట్ శాంతి కృష్ణ సేవా సమితి వారు గ్లోబల్ డివోషనల్ విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి హుజురాబాద్ కి వన్నె తీసుకువచ్చారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.సోమవారం ఉదయం హుజరాబాద్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. మొట్టమొదటిసారిగా ప్రపంచ స్థాయి రికార్డు నెలకొల్పడం ఎంతో శుభ పరిణామని ఇంతటి మహెూన్నత కార్యక్రమాన్ని నిర్వహించిన నృత్య దర్శకురాలు డాక్టర్ చిలమకూరి శ్వేతా (సీతారత్నం) ఎంతో ప్రశంసనీయురాలని కొనియాడారు. ప్రభుత్వాలు ఏవైనా కళాకారుల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతతో కృషి చేస్తానని కళాకారులకు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాల నుండి హుజురాబాద్ కు విచ్చేసిన కళాకారులు అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు..హుజురాబాద్ నియోజకవర్గం లోని అక్కచెల్లెళ్లకు ఏ అవసరం ఉన్న తనను సంప్రదించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఏవైతే హామీలు ఇచ్చానో వాటిని నెరవేర్చడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.. ఏ మహిళకు ఆపద వచ్చిన తనకు ఫోన్ చేస్తే తనవంతు సహాయ సహకారాలు తప్పక అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, హుజురాబాద్ లోని ప్రముఖులు, పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్ మెంట్ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

**- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన యువ వికాసం హామీ అమలు ఎప్పుడు ?**
**- ఏఐఎఫ్ బి జిల్లా కన్వీనర్ సూం**

**జమ్మికుంట, జూన్17( ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో కళాశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు రావలసిన పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్య కిరణ్ డిమాండ్ చేశారు.. హుజురాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో, కళాశాలలో చదివేటువంటి నిరుపేద విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఆలస్యం అయ్యి వారి విద్య పూర్తి చేసుకుని పై చదువులకు వెళ్లే క్రమంలో సర్టిఫికెట్లు తీసుకునే క్రమంలో కూడా ఇబ్బంది జరుగుతుందని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన విద్యార్థులకు తగు న్యాయం చేయాలని వారు కోరారు..కొత్త ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి తగిన న్యాయం చేయాలని, అన్ని రంగాలను అభివృద్ధి చేయాలని కోరారు.జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసి ఉద్యోగాలు భర్తీ చేసి యువకులకు మనోధైర్యం నింపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన 6గ్యారంటీలలో ముఖ్యంగా యువవికాసం తక్షణమే ఈ విద్యా సంవత్సరమే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ నాయకులు దుర్గం బాలు, నాయిని జనార్దన్, మాతంగి ఆర్య సాగర్, భువన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి







**జమ్మికుంట, జూన్17( ప్రజా జ్యోతి):** జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్డులో గల ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముస్లిం సోదరి, సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి స్వాగతం పలికి పూలమాల వేసి శాలువతో సత్కరించారు.. అనంతరం ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ముస్లిం సోదరులకు బక్రీద్ ఎంతో విశిష్టమైనదని చెప్పారు. ఖురాన్ లో చెప్పిన విధంగా పేద ప్రజలకు సహాయం అందించేందుకు ప్రతి వ్యక్తి తమ వంతు బాధ్యతగా పాటుపడాలని పిలుపునిచ్చారు. నిరుపేద ప్రజలకు మన సంపాదనలో ఒక శాతం కేటాయించి ఆదుకోవాలని ఖురాన్ లో ఉందన్నారు..స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపజేయడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.. అనంతరం ముస్లిం సోదరులను ఒకరినొకరు ఆలింగణం చేసుకుంటూ వారికి బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ చెర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, జమ్మికుంట సొసైటీ చెర్మెన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు దయ్యాలా శ్రీనివాస్, గాజుల భాస్కర్, ముస్లిం మాత గురువులు, ముస్లింలు సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థన లో పాల్గొన్నారు.

# ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

**మానవాళి సుఖ శాంతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు**

**సుల్తానాబాద్ జూన్ 17 (ప్రజా జ్యోతి)** సుల్తానాబాద్ పట్టణం లో ముస్లిం సోదరులు ఘనంగా బక్రీద్ పండుగ జరుపుకున్నారు. సోమవారం పట్టనం లోని అలంగీర్ మస్జిద్ ప్రక్కనే ఉన్న ఈద్గా లో 'ఈద్ అల్ అదహ' పర్వదిన ప్రార్థనలు చేశారు.ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై నమాజు పూర్తి చేశారు.ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక దువా' లో ప్రపంచ మానవాళి సుఖ శాంతుల తో జీవనం గడపాలని, విశ్వ ప్రజలందరికి సుఖ శాంతులతో పాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరి కొకరు ఆ లింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణం లోని ప్రముఖులు బక్రీద్ పండుగ సందర్భంగా శుభకాంక్షలు తెలిపారు.



# నేడు పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల





మొదటి పేజీ తరువాయి

మూడోసారి పగ్గాలు చేపట్టిన ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం చేసిన రోజే పీఎం కిసాన్ పెట్టుబడి సాయంపై తొలి సంతకం చేసి రైతుల పట్ల చిత్తశుద్ధి చాటుకున్నారు.


**అన్నదాతలకు అండగా :** 2018-19 నుంచి కేంద్రం పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. తొలి విడత సాయం మే-జూన్ లో, రెండో విడత అక్టోబర్- నవంబర్ లో, మూడో విడత జనవరి-ఫిబ్రవరిలో జమ చేస్తూ వస్తోంది. ఇప్పటివరకు 16 విడతల్లో దేశ వ్యాప్తంగా రూ. 3.04 లక్షల కోట్లు జమ చేసిన కేంద్రం రాష్ట్రంలో అర్హులైన రైతులకు పీఎం కిసాన్ పథకం కింద రూ. 14,717 కోట్లు అందచేసింది. 2024-25 సీజన్లో ఏపీలో 43.52 లక్షల మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ. 870 కోట్లు జమ చేయనుంది. ఇప్పటికే ఈ నిధులను కేంద్రం విడుదల చేసింది. యూపీ పర్యటనలో భాగంగా మంగళవారం పీఎం నరేంద్రమోదీ కిసాన్ 17వ విడత డబ్బులను నేరుగా బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు...

**జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రానికి రానున్న కేంద్ర మంత్రి :** జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం లో 17 వ విడత ప్రధాన మంత్రి కిసాన్ సమ్మన్ నిధి నిధుల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోమన్న కేంద్ర జలశక్తి మరియు రైల్వే శాఖ సహాయ మంత్రి హాజరు కానున్నారు.. ఈ కార్యక్రమం లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేరుగా రైతుల ఖాతా లోకి డబ్బులు జమ చేసే కార్యక్రమం ని ప్రారంభిస్తారు. జమ్మికుంట కెవికె పరిధిలోని రైతులు మంగళవారం మధ్యాణం 3 గంటల నుండి సాయంత్రం 7వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడునని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్ర వేత్త కెవికె హెడ్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్ రావు తెలిపారు..

# ఓడేడులో చేతి బోరు మరమ్మతు

**ముత్తారం జూన్, 17 (ప్రజా జ్యోతి)**

మండలంలోని ఓడేడు గ్రామంలో 5వ వార్డులో చేతిపంపు చెడిపోయి గత కొన్ని రోజుల కావడంతో ఆ వార్డులో బావులు లేక బోరు ఒకటే ఉండడంతో ప్రజలకు చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ వార్డులో 200 నుండి 300 ఫిట్ల వరకు బోర్లు వేసిన పడకపోవడం మరియు బావులు తవ్విన నీళ్లు రాక ఆ ప్రజలకు బావులు బోర్లు లేక ఈ ఒక్క బోరే దిక్కు, ఈ బోరు పాడవడంతో, గ్రామపంచాయతీ నల్ల కొరకు ఎదురుచూపులు చూడడం తప్ప వేరే మార్గం లేక పోలేదు కనుక ఆ ప్రజలు అధికారుల ఈ సమస్యకు పరిష్కారం చేసి నీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు. ఈ ఒక్క బోరు చెడిపోవడంతో ప్రజల ఇబ్బందులను గమనించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్ స్పందించి వెంటనే తన సొంత ఖర్చులతో ఆదివారం మరమ్మతులు చేయించి నీటి ఇబ్బందులను తీర్చారు. దీంతో ఆయనకు వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఎండీ రజాక్, జిల్లెల సంపత్, రాకేష్, ఓదేలు ఉన్నారు.



# అందని ద్రాక్షగా బీసీ బంధు చెక్కులు

## నెలలు గడుస్తున్నా అందని చెక్కులు

## వేల రూపాయలు ఖర్చు చేసిన ఆశావహులు

## బీసీ లోన్ చెక్కులు ఎవరెవరికి ఇచ్చారో తేల్చాలి

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ప్రశ్నించిన దేశిని కోటి

**జమ్మికుంట,జూన్17( ప్రజా జ్యోతి):** హుజురాబాద్ నియోజకవర్గంలోని బిసి కులాల నిరుపేద అభ్యర్థులు బీసీ లోన్స్ కోసం దరఖాస్తులు చేసుకోగా వచ్చిన చెక్కులు హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎవరెవరికి ఇచ్చారో ఏమైపోయాయో వివరణ ఇవ్వాలని ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి డిమాండ్ చేశారు..జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్ లో ఏర్పా చేసిన విలేకరుల సమావేశంలో దేశిని కోటి మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం లో శాసనసభ ఎన్నికల ముందు గత బిఆర్ఎస్ ప్రభుత్వం వివిధ కులవృత్తుల వారికి బీసీ లోన్లు లక్ష రూపాయల కోసమై ఈ ప్రాంత ప్రజలు బీసీ కుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకొని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ వాళ్ల పనులు మానేసి తిరిగి రెండు మూడు వేల రూపాయల ఖర్చు పెట్టుకుని బీసీ సర్టిఫికెట్ తీసుకొని బీసీ లోన్ ల కోసం వేల రూపాయలు పెట్టి దరఖాస్తు చేసుకున్నారు.వాటిలో అర్హులైన అభ్యర్థులకు చెక్కులు వచ్చినయని ఆ చెక్కులు కూడా తన వద్దనే ఉన్నాయని, ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఆ చెక్కులు లబ్ధిదారులకు అందించలేకపోతున్నానని ఎలక్షన్ కోడ్ పూర్తికాగానే ఒక్కొక్కరికి ఇంటికి వచ్చి తనే స్వయంగా ఇస్తానని కౌశిక్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగంగానే తెలిపాడని గుర్తు చేశారు.. ఎలక్షన్ అయిపోయి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ బీసీ బంధు కోసం దరఖాస్తు చేసుకున్న వివిధ కులాల అభ్యర్థులకు బీసీ బంధు అందని ద్రాక్షగా మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు..నియోజకవర్గంలో బీసీ లోన్ ఎంతమందికి వచ్చాయో,ఏ ఏ గ్రామానికి ఎన్ని చెక్కులు పంపిణీ చేశారో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు... బీసీ లోన్స్ కు అప్లై చేసుకున్న అభ్యర్థులు కౌశిక్ రెడ్డి అర్హుల జాబితా, చెక్కుల పంపిణీ వివరాలు తెలియజేసే వరకు కౌశిక్ రెడ్డిని హుజురాబాద్ నియోజకవర్గం లో ఎక్కడికక్కడ అడ్డుకోవాలని కౌశిక్ రెడ్డి ని నిలదీయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొన్నగంటి మల్లయ్య, సుంకరి రమేష్, గూడెపు సారంగపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, శ్రీపతి నరేష్,నెరేళ్ల మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ (ఎం ఎల్ బి) ఇండియా కప్-2024 పోటీలకు బయలుదేరిన సత్యశోధక్ పాఠశాల జట్టు

**సిరికొండ, జూన్ 17 (ప్రజా జ్యోతి)**

కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా-2024 కప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు సోమవారం బయలుదేరారు. ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగే ఈ పోటీలలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల తరపున సత్యశోధక్ పాఠశాల జట్టు పాల్గొనడం జరుగుతుంది. ఈ జట్టులో పాఠశాలకు చెందిన వి. హేమంత్,డి.శ్రీకాంత్, కె.హర్షవర్ధన్, జి.విశాల్ డి.అన్వేష్, బి.తిరుపతి, యస్ . స్నేహిత్, కే . శ్రీకాంత్,బి.సాత్విక్, జి.ప్రదీప్, బి హర్షిత్, కె. అజయ్ తో పాటు కోచ్ మేనేజర్లుగా అనికేత్,సంతోష్, అనిల్ లు వ్యవహరించనున్నారు. జాతీయ స్థాయికి పోటీలలో పాల్గొను క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలను కిట్టులను నేడు పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అందించి అభినందించడమైనది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి,మంచి నైపుణ్యతతో జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు పాఠశాల పి. ఈ. టీ లు అనిల్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయుల్ని ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లీ,తండ్రులు

## - మా పిల్లల్ని మీ బడికి పంపుతాం సరే... మరి మీ పిల్లల్ని ఏ బడికి పంపుతారు సారు...?....

## - (ఏ.ఐ. ఎస్. బి) జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్

**రుద్రూర్, జూన్ 17 (ప్రజా జ్యోతి) :** అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక హక్కుగా అందించాలని ప్రతి ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ప్రభుత్వ బడులలోనే చేర్పించాలని, ఈ విషయంపైన గౌరవనీయులు జిల్లా కలెక్టర్ చొరవ చూపించాలని మార్పు మన జిల్లా నుంచే మొదలు కావాలని (ఏ.ఐ. ఎస్. బి) ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు విద్యార్థుల తల్లీ, తండ్రులు మా పిల్లల్ని మీ ప్రభుత్వ బడులో చేర్పిస్తాం మరి మీ పిల్లల్ని ఏ బడిలో చేర్పిస్తారని ప్రశ్నిస్తున్నారాని ఆయన అన్నారు. మీ పిల్లల్ని ఏమో ప్రైవేట్ స్కూల్ కార్పొరేట్ స్కూలల్లో చేర్పించండి మా పిల్లల్ని ఏమో ప్రభుత్వ బడులో చేర్పించాలా అని విద్యార్థుల తల్లీ,తండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి మాటలు వినలేక చాలా గ్రామల్లో ఉపాధ్యాయులు తూ తూ మంత్రాంగ బడిబాట కార్యక్రమాని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో నెలకు 60 వేల రూపాయలు పైచిలుకు జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు కేవలం 10 వేల రూపాయల జీతానికి పనిచేసే ప్రైవెట్ పాఠశాలలో ఉపాధ్యాయుల దగ్గరకి వెళ్లి మా పిల్లలు ఎలా చదువుతున్నారని, బాగానే చదువుతున్నారా అని అడగడం చాలా ఆచార్యకారంగా ఉందని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితులు మారాలంటే గ్రామస్థాయి నుంచి ఉండే ఉపాధ్యాయుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరూ ముందుకు అడుగువేసి వారి వారి గ్రామల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలలను పటిష్ట పరచుకొని ప్రతి ఒక్క విద్యార్థిని ఆయా ఆయా గ్రామలల్లో ఉండే బడిలోనే చేర్పించే విధంగా చొరవ చూపించాలని ఆయన పేర్కొన్నారు. మెరుగైన విద్యా నిరుపేద అనగారిన విద్యార్థులకు అందాలంటే కింది స్థాయి నాయకుల నుంచి పెద్ద స్థాయి నాయకుల వరకు ప్రతి ఒక్కరు తమ విధిగా భావించి వారి పిల్లల్ని ప్రభుత్వ బడులోనే చేర్పించాలని ఆయన అన్నారు.

# ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభం

**రుద్రూర్, జూన్ 17 (ప్రజా జ్యోతి) :** రుద్రూర్ మండల కేంద్రంలో పతంజలి యజ్ఞ సహిత యోగా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం యోగా శిక్షణ శిబిరాన్ని యోగా సమిత సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ విశ్వనాథ్ మహాజన్ ప్రారంభించారు. ముందుగా యజ్ఞం నిర్వహించారు. అనంతరం ధ్యానం, యోగాసనాలు, సూక్ష్మ, స్థూల వ్యాయమాలు అభ్యసనం చేయించారు. మరో నాలుగు రోజుల పాటు ఈ శిబిరం కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

